# స్వేచ్ఛ

సరోజకు ఆరోజు మనస్సేమీ బాగాలేదు. ఆరోజు భర్త చనిపోయిన రోజు. బాధతో ఆమె హృదయం తడిగుడ్డను మెలికవేసి నీళ్ళన్నీ బయటపడేటట్లు పిండినట్లుగా వుంది. ఎటూ తోచక తన గదిలో అటు యిటూ తిరిగింది. పాత జ్ఞాపకాలు ఆమెను వెంటాడాయి. భర్త వేణు చనిపోయినప్పుడు శేఖర్ రెండేళ్ళవాడు. అంతే ! సరోజకు పెళ్ళయినాక చాన్నాళ్ళకు పుట్టాడు శేఖర్.

సరోజకు పిల్లలే పుట్టరనుకున్నారు. ఆమె ఎంతోమంది డాక్టర్ల చుట్టూ తిరిగింది. అల్లోపతి హోమియోపతి ఆయుర్వేదం నాటు వైద్యుల పసర్లు - ఆమె తినని మందేలేదు. చూడని డాక్టర్లు వైద్యుల్లేరు. చేయించుకోని పరీక్షల్లేవు. ఎవరి హస్తవాసి ఎటువంటిదో అని సరోజ ఎవరు ఏ పేరు చెప్పినా అక్కడికి వెళ్ళేది. యాష్ట లేకుండా మందులు తిన్నది.

సరోజకు మూఢ నమ్మకాలేమీ లేవు. కాని ఏ మంత్రానికి ఏ చింతకాయలు రాలుతాయోనని చివరికి మంత్రగాళ్ళ దగ్గరికి వెళ్ళి తాయెత్తులు కట్టించుకుంది. స్వాముల నాశ్రయించింది. వాళ్ళు చెప్పిన పూజలు చేసింది. ఆమె చెయ్యని నోములు వ్రతాల్లేవు. ఉపవాసాలు వుంది. అనేక తీర్థ దానాలు చేసింది. ఎన్నో దేవుళ్ళకు మొక్కుకొని ఆ దేవుళ్ళను దర్శించింది. పురాణాలు విన్నది. ఎన్నో ఎంతో శ్రద్ధగా చేసినా ఆమెకు పిల్లలు కలుగలేదు.

సరోజ మనోవేదన చూసి ఆమె భర్త వేణు "ఎవర్నైనా పెంచుకుందాం! ఎందుకీ అవస్థలన్నీ" అని అన్నాడు కూడా.

"పెంచుకోవడం నాకిష్టం లేదండి. మన రక్తం పంచుకున్నవాడు కావాలి. మీకూ నాకూ ప్రతిరూపం కావాలి. చూడండి! నేను బిడ్డను కనే చూపిస్తాను!" అంది సరోజ ఛాలెంజి చేసినట్లుగా.

"అటువంటి ఛాలెంజి చేసి సాధించే పని కాదిది! అనవసరంగా మొండిపట్టు పట్టి డాక్టర్లకు డబ్బు పోస్తున్నావు. సరే! డబ్బు పోతేపోనీ వాళ్ళిచ్చే మందులు తిని నువ్వు పడే బాధలు నేను చూడలేకుండా వున్నాను సరూ!" న్నాడు వేణు.

ఒకసారి మందు గోలీలకు సరోజ ఒళ్ళంతా ఎర్రగా పొక్కింది. చాలాసార్లు తలనొప్పి అనీ కడుపు నొప్పి అనీ కాళ్ళు లాగుతున్నాయనీ అనేది.

"ఇదంతా ఏంది సరూ! ఎవరు చెప్పినా ఆ డాక్టరు దగ్గరికి పోతానంటావ్. పోతే మళ్ళీ పరీక్షలు మొదలు! ఎవరినైనా అనాథను చూసి పెంచుకుందామంటె నీ పట్టుదల నీదే!" అని విసుక్కున్నాడు వేణు.

"సరే! మీరు చెప్పినట్లుగానే ఎవర్నైనా పెంచుకుందాం. కానీ ఈ ఒక్క డాక్టరికి చూపించుకోనియ్యండి! ఆమె అమెరికా నుంచి వచ్చిందట. ఈ విషయంలో అనుభవమున్న డాక్టరట. ఎన్నో పరిశోధనలు కూడా చేసిందట! చాలామందికీ ఆశలు వదులుకున్నవాళ్ళకు వయసు మళ్ళిన వాళ్ళకు పిల్లలు పుట్టారట! ఒక్కసారి ఆమెకు చూపించుకుంటాను. తర్వాత మీ ఇష్టం" అంది సరోజ.

ఆ డాక్టరమ్మ మందులు నిజంగానే పనిచేసాయి. ఏ పుట్టలో ఏ పాముంటుందో మనకు తెలియదు! సరోజ గర్భవతి అయింది. శేఖర్ పుట్టాడు. శేఖర్ పుట్టాడన్న ఆనందాన్ని పూర్తిగా అనుభవించకముందే సరోజ భర్త హఠాత్తుగా గుండెపోటుతో మరణించాడు.

ఆయనిది మరణించే వయసే కాదు. బక్కపలచగా వుండే అతనికి గుండెపోటు ఏమిటి! అని అందరాశ్చర్యపోయారు.

"పిల్లాడు ఏ నక్షత్రంలో పుట్టాడో! అందుకే" అని కొందరు నసిగారు.

అది అర్ధరాత్రి. నొప్పి! నొప్పి! అంటూ రెండు చేతులు గుండె మీద వేసి కెవ్వున కేక పెట్టి మంచం మీద వాలిపోయిన వేణు మళ్ళీ లేవలేదు. డాక్టరు వచ్చేంతవరకైనా అతని చావు ఆగలేదు.

భర్త మరణించినప్పుడు సరోజకు బి.ఎస్సీ డిగ్రీ మాత్రమే వుంది. భర్త పనిచేసే కాలేజిలో ఆమెకు ల్యాబ్ అసిస్టెంటుగా ఉద్యోగం ఇచ్చారు. కొంతకాలం తర్వాత లీవ్ పెట్టి ఎం.ఎస్సీ చేసి లెక్చరరు అయింది. భర్త సేవింగ్సు గ్రాట్యుటీ అన్నీ కొడుకు పేర బ్యాంకులో వేసింది. శేఖర్‌కు తండ్రి లేని లోటు తెలియనీయకుండా గారాబంగా పెంచింది. చదువు చెప్పించింది. శేఖర్ కూడా బాగా చదువుకొని ఒక ప్రైవేటు కంపెనీలో ఎం.డి.గా చేరాడు. పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు స్కూలుకు వెళ్తున్నారు.

సరోజ రిటైరై ఏడాదయింది. రిటైరైన దగ్గర్నుంచి సరోజకు ఒంటరితనం ఎక్కువైంది. భర్తపోగానే ఒక వెలితి ఆమె జీవితంలో ప్రవేశించింది. కాని దాన్ని ఉద్యోగంలో చేరి మరచి

పోయింది. తోటి ఉద్యోగినుల స్నేహంతో పనిలో పడిపోయి ఆమె అంతగా ఒంటరితనాన్ని అనుభవించలేదు. కాని ఇప్పుడు రిటైరయ్యాక ఒంటరితనం భరించలేకుండా వుందామెకు.

కాలేజిలో తోటి లెక్చరర్ల స్నేహాలతో ఇన్నేళ్ళు ఎట్లా గడిచిపోయాయో ఆమెకు తెలియలేదు.

శేఖర్ తొందరగానే ఆఫీసుకు పోతాడు. శేఖర్ కన్నా ముందే పిల్లలు స్కూలుకు పోతారు. ఇంట్లో పనంతా తొందరగానే అయిపోతుంది. పనిమనిషి తొందరగానే వస్తుంది. గిన్నెలు తోమి బట్టలుతికి ఎక్కడివక్కడ సర్దేసి పనిమనిషి వెళ్ళిపోయింతర్వాత కోడలు వనజ తనే మిగుల్తారు. వనజ తన గదిలో టీవీ చూస్తూనో నిద్రపోతూనో గడిపేస్తుంది. సరోజ తన గదిలో ఒంటరిగా మిగిలిపోతుంది. టీవీ చూడాలంటే సరోజ కంతగా ఇష్టముండదు. కాసేపు చదువుకుంటుంది. ఈమధ్య ఎక్కువ చదివితే కనుగుడ్లు లాగేస్తున్నాయి. కళ్ళ నుంచి నీళ్ళు కారుతున్నాయి. వనజ బంధువులో స్నేహితులో వస్తే కాసేపు తనతో మాట్లాడుతారు. తర్వాత వాళ్ళు వనజ గదికి వెళ్ళిపోతారు.

సరోజకు కాలేజీ స్నేహితులు తప్ప బంధువులెవరూ లేరు. వున్న కొద్దిమంది ఈ ఊళ్ళోలేరు. ఆమె వాళ్ళ దగ్గరికి వెళ్ళడంగాని వాళ్ళు ఆమె దగ్గరికి రావడంగాని ఎన్నడూ లేదు. వేణు తలిదండ్రులు సరోజ పెళ్ళయింతర్వాత చనిపోయారు. వేణు ఒక్కడే సంతానం వాళ్ళకు. వేణుకు బంధువుల తక్కువే. వేణు చనిపోయినప్పుడు వున్న కొద్దిమంది బంధువులు వచ్చారు. కాని ఆ తర్వాత ఆమె వాళ్ళ ఇళ్ళకు వెళ్ళడం గాని వాళ్ళు ఆమె ఇంటికి రావడంగాని జరగలేదు.

వేణుకు మూఢాచారాల మీద నమ్మకం లేదు. చనిపోయింతర్వాత చేసే కర్మకాండ మీదా అతనికి విశ్వాసం లేదు. అందుకే అతని తలిదండ్రులకు ఏ కర్మకాండలు అతడు చేయలేదు. సరోజ భర్తకూ ఎటువంటి కర్మకాండ చేయలేదు. భర్త చనిపోయిన రోజు ప్రతి సంవత్సరమూ అనాథాశ్రమానికి పోయి సరోజ స్వీట్లు పంచుతుంది. ఆరోజూ భర్త చనిపోయిన రోజు శేఖర్ మామూలుగా ఆఫీసు కెళ్ళిపోతున్నాడు. అది చూసి సరోజ

"బాబూ! శేఖర్! ఈరోజు అనాథాశ్రమానికి వెళ్దామా" అని అడిగింది.

సరోజ వెంట శేఖర్ పోవడం ప్రతి సంవత్సరం జరుగుతుంది. అందుకే సరోజ తండ్రి చనిపోయిన రోజును శేఖర్‌కు గుర్తు చేయాలని అట్లా అడిగింది. శేఖర్ నిజంగానే మరచిపోయాడు.

"అనాథాశ్రమానికి ఎందుకమ్మా!" అన్నాడు పరధ్యానంగా. శేఖర్ తొందరతొందరగా బ్రేక్‌ఫాస్టు చేస్తు ఏదో ఆలోచనలో వున్నాడు.

"ఎందుకేమిటిరా! ఈరోజు మీ నాన్నగారు చనిపోయిన రోజు" అంది సరోజ.

"హా! నేను మరిచేపోయాను! ఈరోజు ఆఫీసుకు జపాన్ నుంచి డెలిగేషన్ వస్తున్నది. చాలా పెద్ద బిజినెస్ డీల్ మీద సంతకాలు జరిగేది వుంది. నేను రాలేనమ్మా! నువ్వు వెళ్ళమ్మా' అని శేఖర్ బ్రేకుఫాస్టు పూర్తి చేయకుండానే లేచాడు.

"అయ్యో పూర్తిగా తినండి" అంది వనజ. ఆమె భర్త పక్కనే కూర్చుంది.

"నేను ఒక్కతెనే వెళ్ళనా?" అంది సరోజ.

"నేను కారు పంపిస్తానమ్మా! ఏం కావాలో డ్రైవరుతో చెప్పు. వాడే కొంటాడు. కారు పంపిస్తాను" అంటూ గబగబ వెళ్ళిపోయాడు శేఖర్.

అందుకే సరోజ మనసు ఆరోజు బాగాలేదు. చనిపోయిన తండ్రిని సంవత్సరానికి ఒక్కసారి తలచుకోలేని పనులు శేఖర్‌కు - అని సరోజ బాధపడింది.

శేఖర్ కారు పంపించాడు. కారులో వెళ్ళి సరోజ అనాథాశ్రమంలో పిల్లలకు స్వీట్లు పంచి పెట్టింది.

రిటైరయిన దగ్గర్నుంచి సరోజ ఆరోగ్యమూ అంతగా బాగుండడంలేదు. ఏది తిన్నా అరగడం లేదు. దానికితోడు కాళ్ళ నొప్పులు. డాక్టరేమో మార్నింగు వాకింగు చేయండి ఆకలవు తుందీ, కీళ్ళనొప్పులు పోతాయి అని చెప్పాడు. ఇంటి ముందున్న ఖాళీ జాగాలోనే సరోజ పొద్దున్నే లేచి అటు యిటు నడుస్తుంది. అప్పుడప్పుడు స్నేహితుల ఇళ్ళకు వెళ్తుంది. కాని సరోజ బయటికి వెళ్ళడం శేఖరుకిష్టంలేదు. "అమ్మా! ఇన్ని రోజులు ఉద్యోగం అని తిరిగావు. ఇక చాలు. ఇంటి దగ్గరే వుండి విశ్రాంతి తీసుకో!" అన్నాడో రోజు.

"అదికాదురా ఇంట్లో వుంటె నాకు తోచదు. మా స్నేహితులందరం నెలకొక్కసారి ఒకరింట్లో కలుసుకొని భోజనాలు చేసి ముచ్చట్లు చెప్పుకొని సరదాగా గడపాలనుకున్నాం శేఖర్!" సంతోషంగా చెప్పింది సరోజ కొడుక్కు.

"సరే! అజీర్ణం కాళ్ళ నొప్పులు అంటూ ఈ భోజనాలు తిరగడాలు ఎందుకమ్మా! ఇంట్లో కూర్చోక! అందుకేనేమో తిరిగే కాలు తిట్టే నోరు ఊరుకోదని అంటారు!" శేఖర్ చిరాకు పడ్తూ అన్నాడు.

సరోజ బాధపడింది. కాని వెంటనే శేఖర్ తీరే అంత తొందరపడ్డాడు! అనుకొని ఊరుకుంది సరోజ.

భర్త వున్నపుడు సరోజ కథానికలు వ్రాసింది. సాహిత్యాభిమానం సరోజకు మొదటి నుంచీ వుంది. భర్త చనిపోయింతర్వాత కథానికలు ఎక్కువగా వ్రాసింది. ఆ కథానికలను పత్రికలకు పంపిస్తే అవి అచ్చయ్యాయి. చాలామంది ఆ కథానికలను మెచ్చుకున్నారు. సాహిత్యాభిమానులైన స్నేహితులు ఆమెను ఇంకా వ్రాయమని ప్రోత్సహించారు. సాహిత్య సభలకు వెళ్ళేది. సాహిత్య మిత్రులూ ఇంటికి వచ్చేవాళ్ళు. కాలేజి లెక్చరర్లు మగవాళ్ళు

వచ్చేవాళ్ళు. శేఖర్‌కు వాళ్ళు ఎవరూ రావడం ఇష్టముండేది కాదు. వాడప్పటికి చిన్నవాడే అయినా వచ్చిన మగవాళ్ళతో మాట్లాడనిచ్చేవాడు కాదు. అక్కడ నొప్పి ఇక్కడ నొప్పి అని సరోజను సతాయించేవాడు. వచ్చినవాళ్ళు వెళ్ళిపోయేదాకా నానా హంగామా చేసేవాడు. క్రమక్రమంగా సరోజ సభలు సమావేశాలు మానుకుంది. శేఖర్‌కు అమ్మ దగ్గర వుండి హోమ్‌వర్కు చేయించడం, చదువుకుంటుంటె అమ్మ పక్కనే వుండడం చాలా బాగనిపించేది. దాంతో సరోజ కాలేజి నుంచి వచ్చాక బయటికి వెళ్ళడం మానేసింది. క్రమంగా వ్రాయడమూ తగ్గిపోయింది. ఏదో ఆమె మనస్సులో ఊట ఇంకిపోయినట్లనిపించేది.

శేఖర్ పనిచేసే అమ్మాయిని పెళ్ళి చేసుకోనని ముందే చెప్పాడు.

"అమ్మా! ఇంట్లో వుండి ఇల్లు చూసుకునే అమ్మాయి కావాలి నాకు" అని స్పష్టంగా చెప్పేసాడు.

వనజ ఎం.ఎస్సీ చేసింది. ల్యాబ్‌లో రీసెర్చి అసిస్టెంటుగా పని చేస్తుండేది. శేఖర్‌కు ఆమె నచ్చింది. కాని ఉద్యోగం చేయడం నాకిష్టం లేదు అని శేఖర్ చెప్పాడు. వనజ తండ్రికి శేఖర్ నచ్చాడు. మంచి ఉద్యోగంలో వున్నాడు. ఇంకా పైకి వెళ్ళే అవకాశాలున్నాయి! అని ఆయన కూతురు ఉద్యోగాన్ని మాన్పించి ఈ పెళ్ళి చేసాడు.

సరోజ స్నేహితులు నలుగురున్నారు. కాలేజీలో ఆ ఐదుగురు చాలా స్నేహంగా వుండేవాళ్ళు. సరోజ రిటైరయ్యాక కొన్నాళ్ళకు ఆ నలుగురూ రిటైరయ్యారు. ఇంతకు ముందు కాలేజీలో రోజూ కలుసుకునేవాళ్ళు. ఇప్పుడు కలుసుకోవడమే అరుదైంది. దాంతో వాళ్ళు ప్రతినెలా ఒకరోజు ఒకరింట్లో కలుసుకోవాలని నియమం చేసుకున్నారు. ఆ నలుగురి ఇళ్ళల్లో కలుసుకోవడం భోజనాలు చేయడమయింది. సరోజ ఇంట్లో కలుసుకునే రోజు వచ్చింది.

పిల్లలు స్కూలుకు శేఖరు ఆఫీసు కెళ్ళి పోయింతర్వాత సరోజ స్నేహితురాళ్ళకు ఇష్టమైన వంటలు వండింది. వంటలో వనజ సాయం చేసింది. సరోజ కూరలు వండితే వనజ చారు చేసింది. వనజ కూరగాయల పులావ్ బాగా చేస్తుంది. వనజ పులావ్ వండితే సరోజ ఫ్రూటు సలాడ్ చేసి ఫ్రిజ్‌లో పెట్టింది. వంటయ్యాక వనజ భోంచేసి తన గదికి వెళ్ళి పోయింది. లావెక్కుతున్నాని వనజ బ్రేకుఫాస్టు మానేసి పదకొండుగంటలకే భోంచేస్తుంది. మధ్యలో టీ తీసుకొని రాత్రి శేఖరు వచ్చాకనే ఇద్దరు కలిసి తింటారు. మధ్యాహ్నం భోజనం సరోజ వనజతో కలిసి పదకొండు గంటలకు తింటుంది. కాని రాత్రి భోజనం పిల్లలతోనే తిని తన గదికి వెళ్ళిపోతుంది. కాస్సేపు ఏదైనా చదువుకొని పడుకుంటుంది. పిల్లల స్కూలు నుంచి రాగానే వాళ్ళ హోమ్ వర్క్ చేయించడం వనజ చూసుకుంటుంది. ఆ తర్వాత పిల్లలు కాస్సేపు వాకిట్లో ఆడుకొని తొందరగానే భోంచేసి పడుకుంటారు.

పిల్లలు నానమ్మ దగ్గర పడుకుంటామని అల్లరి చేస్తారు. కాని అది వనజకు గాని

శేఖర్‌కు గాని ఇష్టముండదు.

"వాళ్ళు వాళ్ళ గదిలోనే పడుకోనియ్యమ్మా!" అంటాడు శేఖర్.

స్కూలు నుంచి వచ్చాక సరోజ పిల్లలకు స్నానం చేయిస్తానన్నా వనజ వద్దంటుంది.

"మీకెందుకత్తమ్మా! కష్టం" అంటుంది వనజ. కష్టమేమీ లేదన్నా వనజ వినదు. పిల్లలతో కబుర్లు చెప్తామన్నా

"పిల్లలూ ! రండి. హోమ్‌వర్కు చేయాలి!" అని పిలుస్తుంది వనజ. ఇక పిల్లలకు సరోజతో మాట్లాడేందుకు సమయమే వుండదు. సెలవురోజు వస్తే శేఖర్ వనజతో పిల్లలతో కలిసి ఎక్కడికయినా వెళ్తాడు. అలసిపోయి వాళ్ళు రాగానే నిద్రపోతారు. ఇక పిల్లలతో నాన్నమ్మకు మధ్య ఏ అనుబంధమూ ఏర్పడే అవకాశమే లేకుండా పోయింది.

స్నేహితులు వచ్చే సమయమైందని సరోజ వాళ్ళ కోసం ఎదురు చూస్తూ డ్రాయింగు రూంలో కూర్చుంది.

"అత్తమ్మా! మీ ఫ్రెండ్సు వచ్చాక భోంచేసేటప్పుడు నన్ను పిలవండి. నేను వడ్డిస్తాను" అంది వనజ.

"నీకెందుకమ్మా శ్రమ వనజా! అన్నీ టేబిల్ మీదనే వున్నాయి గదా మేమే వడ్డించుకుంటాం" అంది సరోజ మృదువుగా.

"సరే! మీ ఇష్టం" అంది వనజ.

"అత్తగారు తన స్నేహితురాళ్ళతో సరదాగా గడపాలనుకుంటున్నది. తను మధ్యలో కలుగజేసుకోవడం ఆమె కిష్టం లేనట్లుగా వుంద"ని వనజ గ్రహించి ఏం మాట్లాడకుండా తన గదికి వెళ్ళిపోయింది.

సరోజ నలుగురు స్నేహితురాళ్ళు చాలా స్నేహంగా సరదాగా వుంటారు. రావడం రావడమే జోకులు నవ్వులూ వాళ్ళు అల్లరితో - వేసే కేకలతో ఇల్లంతా నిండిపోయింది.

"ఏమిటే! చిన్నపిల్లల్లాగా అల్లరీ! నవ్వులూ! మనం లెక్చరర్లుగా రిటైరయ్యాం. మనం ఇట్లా అరిస్తే ఎట్లా!" అంది సరోజ మధ్యలో కృత్రిమమైన కోపాన్ని నటిస్తూ.

"ఇప్పుడింకేం లెక్చరర్లమే. రిటైరయి ఏడాదయింది! ఇప్పుడు మనం ఎంత అల్లరయినా చేసుకోవచ్చు! అయినా అరవడం మన వృత్తి కదే" అంది నలుగురు స్నేహితురాళ్ళల్లో ఒకతె శైలజ.

"లెకరర్లం ఇప్పుడు కాదనుకో కాని నాయనమ్మలం అమ్మమ్మలం అయ్యాం కదా! ఈ వయస్సులో ఏం అల్లరే!" అంది సరోజ మళ్ళీ సీరియస్ అయిపోయినట్లుగా నటిస్తూ.

"అది నిజమే!" అందరూ పెద్దగా నవ్వారు.

"నాయనమ్మలూ, అమ్మమ్మలూ కాదు. ముసలి వాళ్ళం అయిపోయాం అన

రాదు!" అంది అనూరాధ.

"ఇప్పుడు ముసలివాళ్ళు అని ఎవరూ అనడంలేదు. సీనియర్లు, సీనియరు సిటిజన్లు అంటున్నారు. అది గుర్తు పెట్టుకొని మాట్లాడండి!" అంది అమల.

"అల్లరికి వయసుతో ఏం పనే! సరదాగా గడపాలనుకున్నాం! సరదాగా గడుపుదాం! అంతే!" అంది శైలజ.

మళ్ళా అందరూ "అంతే!" అంటూ పెద్దగా నవ్వారు.

"బొంబాయిలో చిన్నా పెద్దా అందరూ కలిసి నవ్వే క్లబ్బు పెట్టుకున్నారని విన్నాను. ఆ క్లబ్బులో అందరూ చేరి నవ్వడమే పనట!" నవ్వుతూనే అంది గీత.

"నవ్వు నాల్గువిధాల చేటు అని మన పెద్దలన్నారు. ఇప్పుడేమో నవ్వు ఆరోగ్యానికి మంచిదంటున్నారు. కాబట్టి అందరమూ ఒకసారి నవ్వుదాం!" అంది అనూరాధ చేతులు పైకెత్తి "స్టార్టు!" అన్నట్లుగా.

అందరూ ఒక్కసారే పెద్దగా నవ్వారు.

డైనింగు టేబిల్ దగ్గర చేరి మెల్లగా కబుర్లు చెప్పుకుంటూ ఈ వంట బాగుంది ఆ వంట బాగుంది అంటూ సరదాగా భోజనాలు చేసారు.

వాళ్ళ భోజనాలయ్యాక వనజ బయటికి వచ్చి వాళ్ళందర్నీ కలిసింది. వాళ్ళందరూ ఆమెకు ఇదివరకే పరిచయం. కాస్సేపు వాళ్ళ యోగక్షేమాలడుగుతూ మాట్లాడింది. ఫ్రిజ్‌లోంచి ఫ్రూటుసలాడ్ తీసి గిన్నెల్లో పెట్టి అందరికీ ఇచ్చింది. వాళ్ళ మధ్య తను ఎందుకని తిరిగి తన గదికి వెళ్ళిపోయింది.

ఫ్రూటు సలాడ్ తింటూ సరోజ ఆమె స్నేహితురాళ్ళు మళ్ళీ కబుర్లలోకి దిగారు. లోకాన్నే మరిచిపోయి వాళ్ళు మాట్లాడుకుంటూ నవ్వుకుంటున్నారు.

అదే సమయంలో శేఖర్ వచ్చాడు. రోజూ శేఖర్ చాలా లేటుగా వస్తాడు. ఎప్పుడైనా మీటింగు లున్నప్పుడు మధ్యలో ఇంటికి వచ్చి విశ్రాంతి తీసుకొని వెళ్తుంటాడు. అట్లా వచ్చాడేమో అనుకుంది సరోజ.

శేఖరు వచ్చాడని సరోజ స్నేహితురాళ్ళను తన గదిలోనే వదిలేసి బయటికి వచ్చింది.

"శేఖర్! భోంచేస్తావా?" అని అడిగింది.

తల్లి అడిగిందానికి జవాబియ్యకుండా అటు యిటు చూసాడు. "ఏమిటీ గోల!" తల్లివైపు చూసి చిరాగ్గా అడిగాడు శేఖర్.

"ఏం లేదు. నా ఫ్రెండ్సు వచ్చారు. మాట్లాడుకుంటున్నాం" అంది సరోజ. శేఖర్ ముఖం మీద చిరాకు చూసి ఆమెకు భయమేసింది.

"ఏమిటమ్మా! చిన్నపిల్లల్లాగా. అది మాట్లాడుకోవడమా!"

"అది కాదురా!"

"ఏది కాదమ్మా! బయటి వరకు మీ నవ్వులు వినిపిస్తున్నాయి. అదేమైనా బాగుందా!" అన్నాడు శేఖర్ గంభీరంగా.

సరోజ స్నేహితురాళ్ళు గదిలో నుంచి బయటికి వచ్చారు.

"మేము వెళ్తామే - మళ్ళా కలుసుకుందాం! బై!" అని చెప్పి గబగబ వెళ్ళిపోయారు.

"వాళ్ళు నా ఫ్రెండ్సు. వాళ్ళను నువ్వు పలకరించనైనా లేదు! అదేమైనా బాగుందా!" అడిగింది సరోజ.

"నీ ఫ్రెండ్సు అయితే ఏమిటి? ఈ వయస్సులో ఇదంతా ఏమిటమ్మా?" అన్నాడు శేఖర్. అతని ముఖం ఎర్రబడింది.

"ఏదో సరదాగా కలుసుకుంటుంటాం. రిటైరయ్యాం కదా! - ఏం తోచక" ఆగుతూ ఆగుతూ అంది సరోజ.

"తోచకపోతే పనులు లేవా? పిల్లల్ని స్కూలు నుంచి తీసుకరావచ్చు గదా! వాళ్ళను స్కూలుకు తయారు చేయడంలో హోంవర్కులో సాయం చేయవచ్చుగదా!"

"వనజ-" అని ఏదో చెప్పబోయింది సరోజ.

"వనజ ఒంట్లో బాగుండడంలేదు. షీ ఈజ్ ఎక్స్‌పెక్టింగు గదా!" నీకు తెలియదా అన్నట్లుగా చూసాడు శేఖర్.

"నీళ్ళు పోసుకుందా! నాకు తెలియదు! ఇద్దరు పిల్లలూ -" సంకోచంగా ఆగింది సరోజ.

"ఇద్దరూ ఆడపిల్లలు గదమ్మా! నాకు మగపిల్లాడు కావాలని వుందీ. వనజ ఏం పని చేయడం లేదు గదా ! కమాన్ లెట్ అజ్ ట్రై! అన్నాను. వనజ ఒప్పుకుంది"

"నాకు తెలియదా విషయం" సరోజ బాధ ఆశ్చర్యం పెనవేసుకోగా అంది.

"అమ్మా! టీనేజ్ పిల్లల్లా మీరు ఆ విధంగా అరుపులు నవ్వులూ! నాకిష్ట ముండదు!" అన్నాడు పడగ్గదిలోకి వెళ్ళిపోతు.

హఠాత్తుగా శేఖర్ నోట్లో నుంచి వచ్చిన ఆ మాటలకు సరోజ నిర్విణ్ణురాలైంది.

"అదేమిటి ఈ ఇంట్లో - నా ఇంట్లో నా కిష్టమైన వాళ్ళతో ఇష్టమైన విధంగా గడిపే స్వేచ్ఛ నాకు లేదా."

సరోజకు కళ్ళల్లో నీళ్ళు నిండాయి.

"ఈ కొడుకునేనా కావాలని ఎన్ని కష్టాలు పడి కన్నది తను! తన సుఖం, తన అభిరుచులు అన్నీ వదులుకొని వాడిదే లోకంగా బతికాను కదా! ఇప్పుడూ!-" దు:ఖం ఉప్పొంగింది సరోజకు.

"వాళ్ళ జీవితాలకు స్వేచ్ఛకు నేను అడ్డుగా అనిపిస్తున్నానా వాళ్ళకు? నాకు నేనుగా వేరే వుంటే! - ఈ ఆంక్షలు అధికారాలుండవు గదా!" అనుకుంది.

"కానీ! ఒక్క కొడుకు! వాడ్ని విడిచిపెట్టి నేనెక్కడికి పోతాను! -పోయినా లోకమేమను కుంటుంది!" సరోజ కన్నీళ్ళు ఇంకిపోయినాయి. ఆలోచనలు ఉవ్వెత్తున లేచాయి.

"రిటైరైయినప్పుడు నాకు వచ్చిన గ్రాట్యుటీ ఇంకా లైఫ్ ఇన్సూరెన్సు డబ్బు వుంది. నెలనెలా పెన్షన్ కావల్సినంత వస్తున్నది. ఒకరి మీద ఆధారపడకుండా నేను బతగ్గలను. కానీ!-" అంది మనస్సు ఓ మూల.

"డబ్బు వుంది నిజమే! ఆ డబ్బు కొడుక్కు అవసరం కూడా లేదు. వాడే కావల్సి నంత సంపాదిస్తున్నాడు. కానీ! తనకు ఈ వయస్సులో అండదండలు కావాలి. మమతాను రాగాలు కావాలి!" అంది మనస్సు మరోమూల.

"అయితే మమతానురాగాల కోసం స్వేచ్ఛ లేకుండా వాళ్ళ అధికారాధిపత్యంలో వుండవలసిన అవసరం లేదు. వాడికి రెక్కలు వచ్చిననాడే తన రెక్కలు కత్తిరించ బడ్డాయి!" నవ్వుకుంది సరోజ.

సరోజ బాగా ఆలోచించింది. ఒక నిర్ణయానికి వచ్చింది. "ఓల్డేజి హోమ్‌లో వుంటూ అప్పుడప్పుడు వచ్చి వాళ్ళను చూసి వెళ్తాను. ఎప్పుడైనా వాళ్ళూ వస్తారు నన్ను చూడ్డానికి. వాళ్ళ స్వేచ్ఛ వాళ్ళకుంటుంది. నా వ్యక్తి గౌరవం నాకుంటుంది. దూరంగా వుంటేనే మమతాను రాగాలేమో!" నిట్టూర్చి లేచి తన బట్టలు ఒక పెట్టెలో సర్దడం మొదలుపెట్టింది సరోజ.

* * *